శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## జేబీఆర్‌లో శుభదిన్ కా తిథి భోజన్



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీహరి విద్యార్థులపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ తమ సొంత ఖర్చులతో బలవర్ధకమైప పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి శ్రీహరి తనవంతుగా ఎంతో కృషి చేశారన్నారు. మంగళవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ మంచి భోజనం అందించడం పట్ల శ్రీహరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## కండలేరులో 32,300 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 30, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో మంగళవారం ఉదయానికి 32,300 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 850 క్యూసెక్కులు, హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 1230 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2110 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.




## సిఎం చంద్రబాబుచే సామాజిక పెన్షన్‌ల పంపిణీ
### - డిఆర్డిఏ పిడి నాగరాజ కుమారి



**నెల్లూరు, జున్ 30, ప్రభాతవార్త - కలెక్టరేట్** నెల్లూరు జిల్లా యన్.టి.ఆర్ భరోసా సామాజిక పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం జులై 1వ తేదిన పించను పంపిణి జరుగునని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిల్లకూరు మండలంలోని పున్నపువారిపాలెం గ్రామములో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలియచేసారు. ఉదయం 6.30 గంటల నుండి పించన్ల పంపిణి యాప్ అందుబాటులో వుంటుంది అని, జిల్లాలో మొత్తం 2,86,663 పింఛనుదారులకు రూ. 126,24,39,500లను, ప్రతి పింఛనుదారుని ఇంటివద్దనే పింఛను పంపిణి చేయబడును అని ఇందుకుగాను 13265 క్లస్టర్‌లలో 6593 మంది సిబ్బందిని సచివాలయ వారీగా విధులు నిర్వహించే విధంగా, అన్నీ ఏర్పాటులను చేయడమైనదని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజకుమారి తెలియచేసారు.

## మనుబోలు సచివాలయంలో రికార్డులు
### తనీఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్



**మనుబోలు జూన్ 30 ప్రభాతవార్త** స్వర్ణగ్రామ స్వర్ణ వార్డుకు సంబందించి మనుబోలు 2 వ సచివాలయంను జిల్లా జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మిఖి తనీకి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో సర్ కార్యక్రమం సక్రమంగా విధులకి హాజరౌతున్నారా అని రికార్డులను పరిశీలించారు. వన్‌బి అడంగల్ రేషన్ కార్డు తదితర సేవల అప్లికేషన్లు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు రమాదేవి, ఎంపిడిఒ జలజాక్షి, డిప్యూటి ఎంపిడిఒ గరుడయ్యా, శ్రీనివాసులు, వీఆర్ఒలు, నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు పంచాయితీ కార్యదర్శిలు శ్రీహరి, శ్రావాణి ఉన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా ప్రవేటు విద్యా సంస్థ

**మనుబోలు జూన్ 29 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలు గ్రామంలో ఓ ప్రవేటు విద్యా సంస్థ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ప్రవేటు విద్యా సంస్థలను ఏర్పాటు చేయడం నిబంధనలకు వ్యతిరేకం .అయినప్పటికి మండలకేంద్రంలో స్దానిక ఉన్నత పాఠశాలకు ఎదురుగా ప్రాధమిక పాఠశాల ముందు భాగంలో మధ్యలో ప్రైవేటు పాఠశాలకు విద్యాశాఖ అధికారులు ఏలా అనుమతులు ఇచ్చారంటు గ్రామస్తులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు వేలాది రూపాయాలు లంచం తీసుకొని ఇటువంటి అనుమతులు ఇచ్చారంటు పలువురు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి పాఠశాల అనుమతులను రద్దు చేసి మరోచోటుకి మార్చిడి చేయాలంటు విద్యార్దుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## భక్తుల కోర్కెలు తీర్చే పవిత్ర స్థలం బారా షహీద్ దర్గా

**– రొట్టెల పండుగ ముగింపు వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త – వైద్యం :** రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు అద్భుత ఏర్పాట్లు చేసిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జిల్లా యంత్రాంగానికి అభినందనలు నెల్లూరు బారా షహీద్ దర్గాల ఐదు రోజుల రొట్టెల పండుగ మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఉన్న బారా షహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ ఎంతో పవిత్రమైన పండుగని కొనియాడారు. ఈ పండుగకు దేశ, విదేశాల నుంచి, అలాగే రాష్ట్రం నలుమూలల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. భక్తులు తమ కోరికలు నెరవేరితే, లేదా ఏవైనా కోరికలు ఉంటే ఇక్కడ రొట్టెలు వదలడం, పట్టుకోవడం చేస్తుంటారని తెలిపారు. ఈ సంప్రదాయంపై ఉన్న బలమైన నమ్మకం వల్లే ఏటా లక్షల మంది భక్తులు ఈ పండుగకు వస్తున్నారని, తాను కూడా గత 20 సంవత్సరాలుగా ఇక్కడికి వచ్చి ఆశీస్సులు పొందుతున్నానని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గుర్తుచేసుకున్నారు. పండుగకు భారీగా తరలివచ్చే భక్తులకు ఏ మాత్రం అసౌకర్యం కలగకుండా ఉండేలా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి, అలాగే జిల్లా యంత్రాంగం, దర్గా కమిటీ సభ్యులు, సేవలు అందించిన అందరికీ ఆమె తన ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ఏటా ఈ పండుగను ఇంకా ఘనంగా జరపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక్కడికి విచ్చేసిన భక్తులందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని, అందరి కుటుంబాలకు మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు. రొట్టెల పండుగ చివరి రోజున రాష్ట్రం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి, యువ నాయకులు నారా లోకేష్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్‌తో కలిసి తాను రొట్టెలు మార్చుకున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహాలు



**వింజమూరు, జూన్ 30, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు వచ్చారు. పాఠశాల అభివృద్ధికి పాఠశాల పూర్వ విద్యార్థుల సైతం చేయూత నిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు వీరరాఘవులు ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు ప్రోత్సాహాలు కార్యక్రమంలో కడియాల పెంచలయ్య రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి తనయుడు శ్రీనివాసమూర్తి 2025 - 2026 విద్యా సంవత్సరం ఎస్ఎస్‌సి ఫలితాలలో పాఠశాల స్థాయిలో మొదటి రెండు స్థానాలు సాధించిన గురు విగ్నేష్, అలేఖ్య ఇద్దరు విద్యార్థులకు చెరో పదివేల రూపాయలు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారిలోని ప్రతిభను ప్రోత్సహిస్తూ ఉత్తమ ఫలితాలను సాధించేందుకు వారు చేస్తున్న శ్రమ అందుకు నిదర్శనం పాఠశాల నుండి విజేతలైన విద్యార్థులే నిదర్శనం అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఇదే విధంగా నగదు బహుమతులు అందజేస్తారని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాల అభివృద్ధిలో మేము సైతం అంటూ 1974 - 75 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన వీరు విద్యార్థుల సౌకర్యార్థం వంద సిమెంటు డైనింగ్ టేబుల్ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో కూడా ఇదే పూర్వ విద్యార్థులు సుమారు 80,000 రూపాయల వ్యయంతో స్పీకర్ మైక్ బాక్సును బహూకరించారు. మాతృ సంస్థను మరవకుండా అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్టాండ్‌లో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన జోనల్ చైర్మెన్




**ఆత్మకూరు ,జూన్30,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసి బస్టాండులో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం నెల్లూరు ఆర్టీసి జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రారంభి ంచారు. ఆయనకు స్నేహితుడైన అనంతసాగరం జడ్పీ టిసి సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి విరాళంతో ఈప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ శివకేశవయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసి ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించాలని , వసతులన్ని సక్రమంగా ఉండాలన్న సంకల్పంతో అధికారులు, దాతల సహకారంతో తన జోన్ పరిధిలోని అన్ని డిపోల్లో వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ప్రయాణీకుల సంఖ్య పెరిగినందున బస్సుల సంఖ్యను పెంచేందుకు కూడా కృషి చేస్తున్నామని, ఆగస్టులో 1051 ఎలక్ట్రికల్ ఎసి బస్సులు జిల్లా కు రానున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారిణి షేక్ షమీం, స్థానిక ఆర్టీసి డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజ్‌కుమార్, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్, నున్నా సంతోష్‌కుమార్, కాటా మహేశ్వర్‌రెడ్డి, వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, ఆర్టీసి యూనియన్ల నాయకులు, కార్మికులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

## ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు వాయిదా.. జులై 2న విడుదల

**కోట,జూన్ 30 ప్రభాతవార్త :** ఏపీలో లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠంగా ఎదురుచూస్తోన్న ఎప్‌సెట్ ఫలితాలు వాయిదా పడ్డాయి. సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాలు పూర్తి స్దాయిలో రానందను.. విద్యార్థుల అభ్యర్ధన మేరకు వాయిదా వేయాలని నిర్ణయించారు ఎపీఎప్ సెట్ ఫలితాలు జులై 2న (గురువారం ) విడుదల చేయనున్నారు.మే 12 నుంచి 20 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరగ్గా.. దాదాపు 3.29 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. షెడ్యుల్ ప్రకారమైతే జూన్ 1 నాటికే వెలువడాల్సింది. అయితే ఇంటర్ మార్కులుకు 25 శాతం వెయిటేజీ ఉంటంతో ఏ ఒక్క విద్యార్ధి నష్టనం జరగకూడదనే ఉద్దేశంతో ద్వితీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు,సీబీఎస్‌ఈ రివైజ్డ్ ఫలితాలు పూర్తి స్దాయిలో వచ్చే వరకు అధికారులు వేచి ఉండటంతో జాప్యం జరిగిందని అధికార వర్గాలు తెలిపాయి.

## ఇకపై 125 రోజుల పనిదినాలు శ్రామికులకు మంచి రోజులు

**కోట,జూన్ 30 ప్రభాతవార్త :** గ్రామాల్లోని పేదల వలస వెళ్లకుండా వారికి సొంతూరులోనే ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2006లో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొత్త రూపు దిద్దుకొని వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజవీకా మిషన్ ( వీబీజీరామ్‌జీ ) పథకంగా అమల్లోకి రానుంది. జూలై 2న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ది శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తిరుపతి జిల్లా ముక్కావారిపల్లెలో ఈ పథకాన్ని ప్రారంభి చనున్నారు.గతంలో ఉన్న 100 రోజుల పనిదినాలును 125 రోజులకు పెంచారు. 15 రోజుల్లోనే శ్రామికుల ఖాతాల్లో వేతనం జమ చేయనున్నారు.

**సర్కారు కార్యాలయాలకు సొంత భవనాలు :** గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ ,ఆరోగ్య కేంద్రాలు,పశు వైద్య కేంద్రాలు, సామాజిక భవనాలు, క్రీడా మైదానాలు, శ్మశాన వాటికలు, మార్కెట్ యార్డులు సంతలు, గ్రంథాలయాలు, పాఠశాలలు అదనపు గదులు, కల్యాణ మండపాలు, వంట గదులు,వ్యాయామశాలలు, ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ, కేంద్రాలు ప్రహరీలు, రోడ్లు, కల్వర్టులు, నిర్మాణ పనులు జీవనోపాధిలో కల్పించే వసులు సమారూరనున్నాయి.కాగ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం వాటా 90శాతం ఉండగా ఈ కొత్త పథకంలో కేంద్రం వాటా 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం ప్రభుత్వమే భరించాలి.

## రాత్రులు యద్దేశ్చగా మట్టి తోలకాలు;అడ్డుకున్న అధికారులు



**కలిగిరి, జూన్30, ప్రభాతవార్త;** రాత్రి వేళల్లో యదేశ్చగా మట్టి తోలుతున్న 8టాక్టర్లను అధికారులు కాపుకాసి పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన కలిగిరిలో జరిగింది. సోమశిల ఉత్తరకాల్వ అదికారితెలిపిన తెలిపిన వివరాల మేరకు సోమశిల ఉత్తర కాలువ కట్టపై ఉండే మట్టిని కొందరురాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు సమాచారముందన్నారు. ఈ క్రమంలో తమకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం రాత్రివేళ జెసిబిసహాయంతో కొన్ని టాక్టర్లు రాత్రి వేళల్లో మట్టి తోలుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తాము ఉత్తరకాల్వ వెంట తిరుగుతుండగా కొన్ని టాక్టర్లు మట్టి తోలుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీనితో కలిగిరి పోలీసుల సహకారంతో టాక్టర్లను అడ్డగించగామట్టిని తీసుకెళ్తున్న 8టాక్టర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించి వారిపై రిపోర్టు ఇవ్వడం జరిగిందన్నారు. టాక్టర్లను పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. ఇకపై ఎవ్వరైనా ఉత్తరకాల్వ కట్టపైమట్టితరలించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సోమశిల ఉత్తరకాల్వ జెఇ మదన మోహన్‌రావు తెలిపారు.ఇది ఇలా ఉంటే మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. కాలువ గట్లు చెరువులు, బీడు భూములు, ప్రభుత్వ భూములనుండి ప్రతిరోజూ పదులసంఖ్యలో మట్టి తరలిస్తున్నాపట్టించుకునే నాదుడే మండలంలో లేడు. అధికారులకు తెలిసినా వారితో మనకెందుకులే అనేచందంగా వ్యవహరిస్తున్నారు. పైగా అదేమీ మనసొమ్ముకాదులే మనకు జీతాలు వస్తున్నాయి.ఎవరు ఎక్కడ పోతే మనకెందుకులే అనేచందంగా కలిగిరి మండలంలోని అధికారులు వ్యవహ రించడం,పైగా మట్టి మాఫియానుండి కొందరికి నెలమామూళ్లు అందుతుండడంతో ఎక్కడా ఏ ఇబ్బందులు లేకుండా మట్టిని యదేశ్చగా తోలుకుంటున్నాయి. ఎవరైనా విలేఖర్లు పోటోలు తీసినా తొక్కిచేస్తాం జాగ్రత్త అనే దోరణిలో వ్యవహరిస్తున్నారంటే వారి భలం ఏపాటిదో ఇట్టే తెలిసి పోతుంది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి మట్టి మాఫియాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా మట్టితోలుతున్న 8టాక్టర్లను పట్టుకున్న అధికారులు మట్టిపోసే జెసిపిని వదిలి వేయడం వెనుక ఉన్న మతలబు ప్రజలకు అర్దంకావడంలేదు.

## వీపీఆర్ ఫౌండేషన్ చొరవతో కాలువలకు పూర్వ వైభవం





**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రధాన సాగునీటి కాలువలు గుర్రపుడెక్క, చెత్తాచెదారాలతో పూర్తిగా నిండిపోయాయి. ఈ నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా సాగునీటి కాలువలకు పూర్వ వైభవం తెచ్చేలా ప్రత్యేక దృష్టి సారించారు. రిజర్వాయర్ నుంచి పంటకు నీరు విడుదల చేసినా సాగునీటి కాలువల్లో గుర్రపుడెక్క ఆకు పూర్తిగా నిండిపోవడంతో చివరి ఆయకట్టు భూమికి నీరు ఆశించిన మేర ప్రవహించే దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో రైతుల విన్నపం మేరకు గత రెండు రోజులుగా కోవూరు మండలంలోని దుంపల కాలువ, యానాది రెడ్డి కాలువ, చీలి కాలువలకు తిరిగి పూర్వ వైభవం వచ్చేలా వీపీఆర్ ఫౌండేషన్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో రైతులు దగ్గరుండి ప్రొక్లెయిన్ ద్వారా గుర్రపుడెక్క ఆకు, చెత్తను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో మండల రైతాంగం హర్షం వ్యక్తం చేసూనత ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రాపూరులో ఇంటింటికి పోలియో చుక్కలు



**రాపూరు, జూన్ 30, ప్రభాతవార్త** చిన్నారుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది రాపూరు మండలంలో మంగళవారం ఇంటింటికి తిరిగి పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. పల్స్ పోలియో అఖరి విడతలో బాగంగా ఆదివారం, సోమవారం పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోయిన చిన్నారులను గృహసందర్శన ద్వారా గుర్తించి ఐదు సంవత్సరాల లోపు వయస్సున ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్‌లో యంపిహెచ్ఇఒ అబ్దుల్ సలాం, యంఎల్‌హెచ్‌పి పి. సురేఖ, అశాలు ప్రయాణాలు చేసే పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

## నేడు మహావిష్ణువు,అయ్యప్ప స్వామి ఆలయాలలో వార్షికోత్సవం



**రాపూరు, జూన్ 30, ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీలోని మద్దెలమడుగు సెంటర్‌లో వున్న శ్రీశ్రీశ్రీ మహావి ష్ణు వు, శ్రీఅయ్యప్ప స్వామి వారి నిర్మించి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూలై 1వ తేది బుదవారం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ గణపతి, సుబ్రమణ్యేశ్వర స్వా మి, శ్రీ మాళికాపురత్తమ్మ, శ్రీ మహాలక్ష్మీ అమ్మ వారు,శ్రీ అంజనేయ స్వామి, శ్రీ గరుత్మంతుడు, శ్రీ మహా విష్ణువు, శ్రీ అయ్యప్ప స్వాములకు ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ మహావిష్ణు సమేత శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శాంతి కళ్యాణం వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు యంసీ పౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం ప్రత్యేక పూజలు,తీర్ధ, ప్రసాదాల వితరణ వుంటుందన్నారు. జూలై 2వ తేది గురువారం ఉదయం 7.30 గంటలకు శ్రీ మహావిష్ణువు, శ్రీ అయ్యప్ప స్వామి వార్ల గ్రామోత్సవం పాపకన్ను మధుసూధన్ రెడ్డి సహకారంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## కళ్యాణిని సత్కరించిన స్వచ్ఛంద సంస్థలు



**కావలి, జూన్ 30 ప్రభాతవార్త :** స్థానిక డాక్టర్ లక్ష్మీ క్రిష్ణారావు విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యా యురాలిగా పనిచేసిన జి.కళ్యాణి పదవీవిరమణ కార్యక్రమం మంగ ళవారం పాఠశాలలో జరిగింది. ఈ కార్య క్రమంలో పట్టణంలోని వివిద స్వచ్చంద సంస్థల వ్యవస్థాపకులు పాల్గొని ఆమెను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె ఉపాధ్యా యురాలిగా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వచ్చంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.బాష, రత్నమ్మ పౌండేషన్ ఎంవి.ప్రసాద్‌రావు, హ్యాపి సేవాసంస్థ సయ్యద్‌ఘనిబాష, గుడ్‌మెన్ సోమిశెట్టి బ్రహ్మయ్య, జాగో సంస్థ ఎస్‌కె,జమీర్, ప్రభాకర్, విజయ్ దేవరకొండ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ రైట్స్పై గిరిజనులకు అవగాహన



**విడవలూరు, జూన్ 30 ప్రభాతవార్త:** మండలంలోని దంపూరు గిరిజన కాలనీలో మంగళవారం సివిల్ రైట్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ ఎ. లక్ష్మీప్రసన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన సమాన హక్కులు, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కులను పరిరక్షించడమే సివిల్ రైట్స్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కులం, మతం, లింగం, జాతి వంటి అంశాల ఆధారంగా ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ముఖ్యంగా గిరిజనులు, దళితులు, బలహీన వర్గాలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని, హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు చట్టపరమైన రక్షణ పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రజలు తమ హక్కులు, విధులపై అవగాహన కలిగి చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటరమణమ్మ, ఆర్ఐ అబ్దుల్ సలాం, నాయకులు చేవూరు

## ఎంపిడిఓ రజనీకాంత్ పదవివిరమణలో వెల్లువెత్తిన అభినందనలు



**అల్లూరు, జూన్ 30 ప్రభాతవార్త :** ఎంపిడిఓ రజనీకాంత్ పదవీవిరమణ సభను డివిర్ కళ్యాణ మండపంలో మంగళవారం కుటుంబసభ్యులు, అధికారులు, నా యకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి నాయకులు పెన్నాడెల్టా వైస్ ఛైర్మెన్ బీదగిరిధర్, రిటైర్డు జడ్జి సిఈఓ పెంచల్‌రెడ్డి మాట్లాడుతూ మంచి వ్యక్తి సౌమ్యుడు అయిన ఉల్లగంటి రజనీకాంత్ ప్రభుత్వ ఉద్యోగం పొందిన ప్పటి నుంచి అంచెలు అంచెలుగా పదోన్నతి పొందుతూ పలు మండలాల్లో ఎంపిడిఓగా అధికారులు కిందిస్థాయి ఉద్యోగులు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవ చేశారని కొనియాడారు. చివరగా అల్లూరు ఎంపిడిఓగా పదవీవిరమణ చేయడంతో ఆయనపై ఉన్న అభిమానంతో ప్రజలు, నాయకులు, అధికారులు, కుటుంబసభ్యులు ఇంతమంది రావడం ఆయన మంచితానికి నిదర్శనమని కొనియాడారు. పలువురు అధికారులు ఆయనతో కలిసి పని చేసిన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రజనీకాంత్ మాట్లాడుతూ నాపై అభిమానంతో పదవి వీరమణ సభకు విచ్చేసిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కుటుంబసభ్యులు, అధికారులు సహ ఉద్యోగులు, పాత్రికేయులు, రాజకీయ నాయకులు ఎంపిడిఓ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పణికుమార్, మండల అధ్యక్షురాలు శశిరేఖ, ఎంఈఓలు రవీంద్ర, సునీత, నగర పంచాయితీ మేనేజర్ వరప్రసాద్ పలువురు అధికారులు, ప్రజలు ఎంపిడిఓ కుటంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామిశెట్టిచే ఉపాధ్యాయునికి సన్మానం




**బిట్రగుంట జూన్ 30 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎం ప్రసాదరావు మంగళవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామిశెట్టి వెంకట సుబ్బారావు ప్రసాద్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యా,సామాజిక సేవలో విశేష కృషి చేసిన ప్రసాద్ రావు సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ మెతుకు రాజేశ్వరి,ఎంపీడీవో సుబ్రమణ్యం, ఎంఈఓ జయమ్మ,ఎన్ ఎస్ ఎన్ మోహన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎన్ ఎస్ మోహన్ పలువురు ప్రముఖులు హాజరు అయ్యారు.

## స్థానిక సమరానికి కసరత్తు

**– సమాచార సేకరణలో అధికారులు**



**కోట, జూన్ 30 ప్రభాతవార్త :** ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానాలకు కూడా సెప్టెంబర్ 25తో గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఈ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సారి ఎంపిటిసి స్థానాలను పంచాయతీలతో మ్యాపింగ్ చేస్తున్నారు. పంచాయతీల్లోని వార్డులు, వివరాలు, ఆ వార్డులోని ఓటర్లతో కూడిన సమాచారాన్ని ఏపీ సేవా పోర్టల్‌లోకి నిక్షిప్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలోని 36 మండలాలు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లను మ్యాపింగ్ చేస్తున్నారు. స్థానాల మ్యాపింగ్‌కు ముమ్మర చర్యలుఎంపిటిసి స్థానాలు, పంచాయతీ వార్డుల సభ్యులు, సర్పంచులకు బ్యాలెట్ విధానంలో ఎన్నికలు ఉంటాయి. ఆ మేరకు మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డులు, బూత్‌లు, ఓటర్ల వారీగా వివరాలతో కూడిన సమాచారంతో మ్యాపింగ్ ప్రక్రియ, బ్యాలెట్లు తదితర వివరాలతో కూడిన సమాచార సేకరణకు జిల్లా అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



**పొదలకూరు, జూన్ 30, ప్రభాతవార్త** పొదలకూరు మండల పరిధిలోని తాటిపర్తి గ్రామ పరిది లోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు మంగళ వారం ఆకస్మిక తనిఖీలు చేసారు. ఈ తనిఖీలలో స్టాక్ రిజిష్టర్, డిబిటి, ఏపిఏఐఎంఎస్‌లలో వ్యత్యాసాలు గుర్తించారు. చైతన్య ఫెర్టిలిజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణం నందు 34.60 టన్నుల వ్యత్యాసాలను గుర్తించి9,84,190రూ పాయలు, బాలాజీ ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ నందు 76.515 టన్నుల ఎరువులు విలువ 9,13,090 రూపాయలు స్టాక్‌ను సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేసారు. ఈ తనిఖీలలో ఏవో వేణుగోపాల్, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, సిఐ సుభాని పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన రొట్టెల పండుగ

**– అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతమైన పండుగ**

**– ముగింపు సభ లో అన్ని శాఖల అధికారులకు – జ్ఞాపికలు అందించిన అబ్దుల్ అజీజ్**



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త – వైద్యం** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ విజయవంతంగా ముగిసింది. ఈ సంధర్భంగా బారాషహీద్ దర్గాలోని ఏపీ టూరిజం ప్రాంగణంలో ముగింపు సభ నిర్వహించారు. ముగింపు సభలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్ని శాఖల అధికారులను అభినందించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్బంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 2014 ముందు రొట్టెల పండుగ అత్యంత దయనీయంగా ఉండేదని, 2014 లో నారాయణ మంత్రిగా, తాను మేయర్‌గా అత్యంత అద్భుతంగా దర్గా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ ఏడాది దాదాపు 20 లక్షల మంది భక్తులు వచ్చారని, క్షణం క్షణం అప్రమత్తంగా ఉండి భక్తులకు సౌకర్యాలు కల్పించామని తెలిపారు. దాదాపు 2 వేల మంది పోలీసు సిబ్బంది పాల్గొని అంగుళం అంగుళం పర్యవేక్షించారని అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదంటే అందుకు ఆ భగవంతుడి దయ, మన కష్టం పోలీసు శాఖ సహకారం అన్నారు. 6 వేల మంది మున్సిపల్ సిబ్బంది పనిచేశారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ శాఖ మంచి సమన్వయంతో పని చేసిందని, అగ్నిమాపక శాఖ ప్రత్యేక శ్రద్ధ వహించిందని అన్నారు.అనేక లోటుపాట్లు గమనించామని, చిన్న చిన్న లోటుపాట్లు వచ్చే ఏడాదికి వాటిని సరిచేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో భక్తులు మరింత పెరిగే అవకాశం ఉందని, అన్ని శాఖల సహకారంతో ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, టీడీపీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డీఎస్పీ దీక్ష ఐపిఎస్, కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ దినేష్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, సమీ హుసేని, కరిముల్లా, సాబీర్ ఖాన్, హయత్ బాబా, దర్గా చైర్మన్ మునీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## అల్లూరు ఆదిశేషా రెడ్డి జన్మదినం పురస్కరించుకుని క్రీడా పోటీలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



**గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త :** అల్లూరు ఆదిశేషా రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కొనియాడారు. గూడూరు పట్టణంలోని స్టేడియంలో రోటరీ క్లబ్ అద్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌లో ఆయన పాల్గొని క్రీడలు ప్రారంభించారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషా రెడ్డి ప్రభుత్వ స్టేడియ ంలో గూడూరు రోటరీ క్లబ్ అద్వర్యంలో అల్లూరు ఆదిశేషా రెడ్డి రోటరీ స్పోర్ట్స్ మీట్ ను ఏర్పాటు చేశారు. ఆదిశేషారెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. క్రీడా జెండాను ఎగురవేశారు. క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషా రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల పట్ల ఆయనకు ఎంతో మక్కువ అని, తరచూ క్రీడలు నిర్వహించే వారని గుర్తు చేశారు. స్టేడియం అభివృద్ధికి ఆయన క్రుషి చేశారని వివరించారు. ఇంకా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు డాక్టర్ జనార్దన్ రెడ్డి, దశరధరామి రెడ్డి, మునిగిరీష్, బాలక్రిష్ణం రాజు, వేగూరు రాజేంద్ర ప్రసాద్, సురేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మి నరసింహ స్వామి వారి చిన్న గరుడ వాహన సేవ



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు రూరల్ మండలం, నరసింహకొండ పై వేదగిరి క్షేత్రముగా వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి విశేష పర్వదినం సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం. రాత్రి చిన్న గరుడ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తృత్వం అనుమాల శెట్టి గిరీష్‌రాజ్యలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, టీడీపీ నాయకులు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**– జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి వి.సుజాత**



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు జిల్లాలో పల్స్ పోలియో దిగ్విజయంగా నిర్వహించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమం మూడవ రోజు మంగళవారం 1490 మంది (0.56 శాతం) ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేశారని చెప్పారు. మొత్తం మూడు రోజులకు కలిపి జిల్లాలో గుర్తించిన 2,67,750 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలకుగాను 2,67,670 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. 99.97 శాతం ప్రగతి సాధించినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ వి. సుజాత తెలియజేశారు. ఇంకా ఏ కారణం చేతైనా పోలియో చుక్కలు వేయించుకోని ఐదు సంవత్సరంలోపు పిల్లల ఉంటే వారిని గుర్తించి వైద్య ఆరోగ్య సిబ్బంది వారం రోజుల లోపు ఆ పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేయవలసిందిగా వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుజాత ధన్యవాదాలు తెలియజేశారు.

## లక్ష్మి నరసింహ ఆలయ అభివృద్ధికి బాటలు

**- మాజీ ఉపరాష్ట్రపతికు వినతి**



**వింజమూరు, జూన్ 30, ప్రభాతవార్త:** వింజమూరు మండలం నల్లగొండ్ల శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకం కింద నిధులు మంజూరు చేయించేందుకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో వెంకయ్య నాయుడును ఆలయ కమిటీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ పుణ్య క్షేత్రానికి భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా మౌలిక సదుపాయాలు తక్కువగా ఉన్నాయని వివరించారు. ఆలయ కమిటీ చైర్మన్లు ఎల్.సి. కొండారెడ్డి, మాజీ చైర్మన్ ఎల్.పి. మాలకొండారెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు కొండా వెంకట ప్రసాద్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. వినతి విన్న వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతి, ఆధ్యాత్మికతకు చిహ్నాలని అన్నారు. ప్రసాదం పథకం కింద నిధులు మంజూరైతే భక్తులకు వసతి గృహాలు, ప్రసాద వితరణ కేంద్రం, రోడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ అధికారులతో మాట్లాడి ఫైలును వేగంగా కదిలించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకయ్య నాయుడు హామీతో సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. నిధులు మంజూరైతే నల్లగొండ్ల ఆలయం మరింత అభివృద్ధి చెంది భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఉదయగిరి బిజెపి నియోజకవర్గ సమీక్ష సమావేశం



**వింజమూరు, జూన్ 30, ప్రభాతవార్త :** సర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి ఓటరు దరఖాస్తు నిర్ణీత గడువులోగా సమర్పించాలని బీజేపీ కోస్తా ఆంధ్ర జోన్ ఇన్‌చార్జ్ మేకల హనుమంత రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం వింజమూరు పట్టణంలోని బిఎల్ఎ2 మానిటరింగ్ కార్యాలయంలో ఉదయగిరి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. బిఎల్ఎ1 ఒరుగంటి మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మేకల హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై సర్ అమలు తీరుపై సమగ్ర సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో బిఎల్‌ఓలకు పూర్తి సహకారం అందించాలి. అర్హులైన ప్రతి ఓటరు ఫారం సక్రమంగా నింపి గడువులోగా సమర్పించాలి. బిఎల్‌ఏ మండల అధ్యక్షులు ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం అని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల అధ్యక్షులు, మండల ఇన్‌చార్జ్‌లు, జిల్లా పదాధికారులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. దేగ మధు యాదవ్, ముదమల రమేష్ రెడ్డి, వింజమూరు మండల అధ్యక్షులు అంబటి ఈశ్వరెడ్డి, దుత్తలూరు మండల అధ్యక్షులు లెక్కల వెంగళరెడ్డి, వరికుంటపాడు మండల అధ్యక్షులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, సీతారాంపురం మండల అధ్యక్షులు కాశీరావు, జిల్లా పదాధికారులు బ్రహ్మరెడ్డి, శివపార్వతి, బాలకృష్ణరెడ్డి, పి.వి. నారాయణరెడ్డి, మల్లికార్జున, నారాయణరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు ఎం. నాగేశ్వర రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈ. శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపడంతో పాటు ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే దిశగా కీలక మార్గదర్శకంగా నిలిచింది.

## రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపుపై శిక్షణా శిబిరం



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమం మంగళవారం కోవూరు మండలం గంగవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ఎస్ సైంటిస్ట్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అధిక రసాయనిక ఎరువులను వాడడం వలన నేల, వాతావరణం, నీటి కాలుష్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు, జీవన ఎరువుల వాడకంపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. నెల్లూరు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి చక్రవర్తి మాట్లాడుతూ రసాయన ఎరువులతో పాటు భూమిని సారవంతం చేసుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులపై దృష్టి పెట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి రజని మాట్లాడుతూ ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రైతుకు సంబంధించిన పంటలు, విస్తీర్ణాన్ని బట్టి యూరియా డీఏపీ ఎంత వస్తుందో రైతులు వారి మొబైల్‌లో చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఓటీపీ చూపించి కొనుగోలు చేసుకోవచ్చున్నారు. బీడు భూముల్లో పీఎండీఎస్ కిట్స్, పచ్చిరొట్ట ఎరువులు వేసుకుని భూమి మీద ఉష్ణోగ్రతను తగ్గించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శిరీష, గ్రామ వ్యవసాయ సహాయకులు నారాయణ, రైతులు ఉన్నారు.

## పరిమితులు వద్దు.. ఆకాశమే హద్దు

**– ఇంజినీరింగ్‌కు కళాశాల, బ్రాంచి ఎంపిక కీలకం**



**కోట, జూన్ 30 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఇంజినీరింగ్‌లో చేరబోయే విద్యార్థులు కళాశాల, బ్రాంచి ఎంపికల విషయంలో పరిపక్వతతో వ్యవహరిస్తే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకున్నట్లే. విద్యార్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఏపీఈఏపీ సెట్ 2026 ఫలితాలు జూలై 2వ తేదీన విడుదల కానున్న తరుణంలో స్పష్టమైన ప్రణాళికతో విద్యార్థులు ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది. ఎలాంటి కళాశాలలో చేరాలో, బ్రాంచిల ఎంపిక విషయంలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై విద్యా నిపుణులు సూచనలిస్తున్నారు.

**లక్ష్యం ఉండాలి :** విద్యార్థికి ఇంజినీరింగ్ ప్రవేశానికి ముందుగానే నిర్ణీత లక్ష్యం ఉండాలి. దాన్ని సాధించడంలో కళాశాల పాత్ర 40 శాతం ఉంటే, విద్యార్థి కృషి 60 శాతం ఉంటుంది. ప్రస్తుత కాలంలో యువత ఆలోచనలు ప్రపంచాన్ని జయించేలా ఉండాలి. సాంకేతికత ఎంతో వేగవంతమైంది. మిత్రులతో, ఇరుగు పొరుగు వారితో పోటీపడే రోజులు కావు ఇవి. అందుకే పరిపక్వతతో నిర్ణయాలు తీసుకోవాలి.

**ఇవి పరిశీలించుకోండి :** అనుకున్న ర్యాంక్ రాగానే కళాశాల అయినా, బ్రాంచిలైనా సరే ఎంపికలో తడబడవద్దు. ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. ముఖ్యంగా కళాశాలలో వనరులు, అధ్యాపక బృందం, అధునాతన సాంకేతికత, డిజిటల్ తరగతి గదులు, ప్రపంచ జ్ఞానాన్ని పెంపొందింపచేసే గ్రంథాలయాలు ఉండాలి. గతంలో కళాశాలలో చదివిన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ పరిస్థితి తెలుసుకోవాలి. చదువుతో పాటు కెరియర్‌కు తగ్గట్టుగా ఇస్తున్న శిక్షణలు, గేట్ వంటి పోటీ పరీక్షలకు అవకాశాలు ఎలా ఉన్నాయని ఆరా తీయాలి.

**కొత్త కోర్సులతో** పోటీ ప్రపంచంలో టెక్నాలజీ అనుసంధానంతో నూతన ఆవిష్కరణలే ధ్యేయంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్పెషలైజేషన్ కోర్సులు వచ్చాయి. కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధాన కోర్సులైన ఏఐ మొబైల్ లెర్నింగ్, డేటా సైన్స్ (ఏఐడీఎస్)తో పాటు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అవసరమైన విద్యార్థులకు కళాశాలలు కొత్తగా కోర్సులు నిర్వహిస్తున్నాయి. అంటే భవిష్యత్‌లో ఆయా కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాల 47 సంవత్సరాల క్రితం ప్రారంభించారు. రాష్ట్రంలోనే నంబర్ టూ స్థానంలో ఉంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రపంచంలోని నలుమూలల దేశాల్లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ అధినేతలుగా, జిల్లా కలెక్టర్లుగా, ఐపీఎస్ అధికారులుగా ఉన్నారు. జాతిరత్నాలను అందించిన ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరేందుకు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలను సందర్శిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి

**– నిందితుడిని అరెస్టు చేయాలంటూ ఆందోళన**





**విడవలూరు, జూన్ 30 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న రెవెన్యూ గ్రామ సహాయకుడు (వీఆర్ఏ) మృతి చెందారు. ప్రమాదానికి కారణ మైన వారిని అరెస్టు చేయాలంటూ వీఆర్ఏ సం ఘం నాయకులు తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.

**– ప్రమాదం ఇలా జరిగింది.** వావిళ్ల గ్రామానికి చెందిన దర్శకుంట వెంకటేశ్వర్లు కొంతకాలంగా రెవెన్యూ గ్రామ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 25న విధి నిర్వహణలో భాగంగా అలగానిపాడు మీదుగా తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా, ఎదురుగా రాంగ్రూట్లో వచ్చిన కారు ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్లో ఆయన్ను నెల్లూరులోని మెడికవర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు.

**– పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన** వెంకటేశ్వర్లు మరణవార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించినా, నిందితుడిని అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ మండల వీఆర్ఏ సంఘం నాయకులు రావూరు శ్రీనివాసులు , సూరి స్వరూప, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శనగా పోలీసు స్టేషన్కు చేరుకుని, స్టేషన్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు.

**– కుటుంబాన్ని ఆదుకోవాలి** "కుటుంబానికి పెద్ద దిక్కైన వెంకటేశ్వర్లు అకాల మరణం చెందడం దురదృష్టకరం. ప్రమాదానికి కారణమైన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. అలాగే, నిరాశ్రయులైన వీఆర్ఏ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి" అని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. చివరగా పోలీసులు జోక్యం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామని వివరించి, దానికి సంబంధించిన పత్రాన్ని వీఆర్ఏ సంఘాలకు అందజేయడంతో ఆందోళన విరమించారు.

## వీఆర్ఏ కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం



**విడవలూరు, జూన్ 30 ప్రభాతవార్త:** మండలంలోని వావిళ్ల గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్ఏ) దర్శకుంట వెంక టేశ్వర్లు (39) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని తహశీల్దార్ ఏ. లక్ష్మీప్రసన్న అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను తహశీల్దార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత, ఆర్ఐ అబ్దుల్ సలాం, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి ఖర్చుల నిమిత్తం దేవాంగ సంక్షేమ సంఘం వితరణ



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** కోవూరు మండలం వేగూరు గ్రామంలో నివశిస్తున్న పముజుల శ్రావణి ఆకస్మికంగా మృతి చెందింది. ఈ మేరకు ఆమె అంత్యక్రియల నిమిత్తం జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ద్వారా 5 వేల రూపాయలను మృతురాలి అత్త పముజుల రమణమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పడవల వెంకటేశ్వర్లు, దేవాంగ ఆత్మీయులు ఉన్నారు. మట్టి ఖర్చుల నిమిత్తం నిధులు సహాయం చేసిన దేవాంగ సంక్షేమ సంఘానికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాని ఆందోళన



**కావలి, జూన్ 30 ప్రభాతవార్త :** అంగన్‌వాడీల దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం అంగన్‌వాడీలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ఐసిడిఎస్ ఏర్పడి 50ఏళ్ళు అయినప్పటికి అంగన్‌వాడీలను ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించలేదని తెలిపారు. 2022లో సుప్రీంకోర్టు అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేయాలని చెప్పినప్పటికి అమలు కాలేదని తెలిపారు. రాష్ట్రంలో 2019నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదని 42రోజుల చారిత్రక సమ్మె సందర్భంగా 2024 జులైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చినా ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన నవచేతన యాప్‌తో అంగన్‌వాడీలకు పనిభారం పెరిగినందున మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు. కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లోని బిల్లులన్నీ మంజూరు చేయాలని తెలిపారు. జులై10న జరిగే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమంలో అధికసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.సుభాషిణి, ఏ.జయంతి, కె.రఘురావమ్మ, విజయలత, హిమబిందు, కె.కళావతి, పెంచలమ్మ, రఘు రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి



**కావలి, జూన్ 30 ప్రభాతవార్త :** సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండరెడ్డి తెలిపారు. భారతరత్న డాక్టర్ బిసిరాయ్ జయంతిని పురస్కరించుకొని జులై1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వ్యాధులకు దూరంగా ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆరోగ్యశాఖ, ప్రజాప్రతినిధులు, పౌరసంస్థలు ప్రజలను మేల్కొల్పి ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా పాటించి మానసికంగా సామాజికంగా పౌరులు ఆరోగ్యంగా ఎదిగినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని తెలిపారు. మంచి ఆహారం తీసుకొని రక్తహీనతను అదిగమించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలు, వైద్యులు కలిసి వైద్యవృత్తికి వన్నెతెచ్చిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. వైద్యులు అందరూ అంకితభావంతో వైద్యసేవలు అందించి డాక్టర్ బిసిరాయి, డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ నార్మన బెతిన్, డాక్టర్ కోట్ని వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని నిరంతరం కృషి చేయాలన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి ఆర్‌కే పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ మేరకు ఆ వ్యక్తి అక్కడికక్కడే తీవ్రగాయాలై మృతిచెందాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై ముత్యాలరావు పరిశీలన చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జేబీఆర్‌లో శుభదిన్ కా తిథి భోజన్



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి విద్యార్థులపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ తమ సొంత ఖర్చులతో బలవర్ధకమైన పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి శ్రీహరి తనవంతుగా ఎంతో కృషి చేశారన్నారు. మంగళవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ మంచి భోజనం అందించడం పట్ల శ్రీహరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## మా భూములను మాకు అప్పగించాలి



**కావలి, జూన్ 30 ప్రభాతవార్త :** మండలంలోని చెన్నాయపాలెం పెద్దపట్టపు పాలెం పంచాయతీలో పలు గ్రామాల పొదుపు, మహిలలకు కేటాయించిన భూములను కొందరు అక్రమంగా అక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని వాటిని స్వాధీనం చేసుకుని తమకు అప్పగించాలని చెన్నయపాలెంకు చెందిన కొందరు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మంగళవారం స్తానిక తహశీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను కలసి మా భూములు మాకే కావాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు తిరుపతమ్మ, జాలమ్మ, అలివేలమ్మ, నరసమ్మ, అరుణమ్మలు మాట్లాడుతూ పొదుపు మహిళల జీవనోపాధి కోసం భూములను కేటాయించిందని ఆ తరువాత ఏ ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ భూములు ఇవ్వలేదని పేర్కొన్నారు. మా ఆదీనంలో ఉన్న భూములను కొంతమంది ఆక్రమించుకోడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. దీనిపై అధికారుల స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 175ఎకరాల మేర సర్వే పూర్తి చేశామని మిగిలిన భూమి సర్వే పూర్తి చేస్తామన్నారు. రికార్డులన్నీ పరిశీలించిన అనంతరం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

## రెవెన్యూ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆగ్రహం



**వింజమూరు, జూన్ 30, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపరిష్కారంలో జాప్యం చేస్తున్న రెవెన్యూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుల రిజిస్టర్, పెండింగ్ దరఖాస్తుల ఫైళ్ల పని తీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే,ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. భూవివాదాలు, సర్టిఫికెట్ల జారీ పట్ల జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి పౌరుడు దేవుడితో సమానం వారికి సమయానికి మర్యాదగా సేవలు అందించడం మీ ప్రథమ బాధ్యత. జీతాలు తీసుకుంటూ జనాలను రోజులు కొద్దీ తిప్పుకుంటూ నిర్లక్ష్య సమాధానాలతో తిప్పి పంపితే ఊరుకునేది లేదుఅని అధికారులను ఉద్దేశించి స్పష్టం చేశారు. ముఖ్యంగా వింజమూరు మండలంలోని నల్ల గొండ్ల, చాకలకొండ, ఏకిస్తీపురం పంచాయతీ పరిధిలో నెలకొన్న భూ సంబంధిత వివాదాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏకిస్తీ పురం గ్రామానికి చెందిన మూలి రమణమ్మ పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై రమణమ్మ కుమారుడు రఘురాం విజయలక్ష్మి దంపతులు గత కొన్ని నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న సమస్య పరిష్కారం చూపకపోవడంతో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సా రెడ్డి పట్టణ అధ్యక్షుడు గురజాల గోపి సమస్య తీవ్రతను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో బాధితులు సమస్య విన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విచారించి న్యాయం చేయాలని అధికారులకు సూచించినప్పటికీ కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఆగ్రహించి కలిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సుబ్బారావు స్థానిక ఎస్సై ఉమామహేశ్వరరావు స్థానిక దేశం నేతలుతో కలిసి రెవెన్యూ అధికారులతో సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రెవెన్యూ పోలీస్ అధికారులు వెంటనే గ్రామానికి వెళ్లి సమస్యకు పరిష్కారం చూపారు. కొన్ని సమస్యలు ఉన్న ప్రాంతంలో వారసత్వ రిజిస్ట్రేషన్లపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఒక ప్రణాళిక ప్రకారం వివాద రహితంగా న్యాయబద్ధంగా పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. రెవెన్యూ సిబ్బంది పనిచేయకుంటే చర్యలుతప్పవనిహెచ్చరించారు.పల్లెల నుంచి వచ్చే రైతులు, మహిళలు, వృద్ధులను కార్యాలయం చుట్టూ తిప్పడం అలవాటుగా మారింది. వీఆర్వో ఆర్ఐ అధికారి లేరు అని సాకులు చెప్పడం మానుకోండి. కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన, సత్వర సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ లక్ష్యానికి ఎవరైనా అడ్డు వస్తే సహించను అని ఎమ్మెల్యే గట్టిగా చెప్పారు. తాను వింజమూరులోనే స్థానికంగా ఉంటున్నానని, ప్రజలను రెవెన్యూ అధికారులు పెడుతున్న ఇబ్బందులను ప్రతిరోజూ తన దృష్టికి తెస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇకపై ప్రతి కార్యాలయం పనితీరును ఆకస్మిక తనిఖీలతో పర్యవేక్షిస్తానని, నిర్లక్ష్యం, అలసత్వం కనిపిస్తే సస్పెన్షన్‌తో సహా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే వీఆర్వోల కొరత విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిలో కలకలం రేగింది. పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయడం ప్రారంభించారు. ఈ తనిఖీతో ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెరుగుతుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ స్వర్ణ, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ సీనియర్ నాయకులు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, కూండ్ల వెంకటేశ్వర్లు, చిలకల వెంకటరెడ్డి, దాట్ల కృష్ణారెడ్డి, ఖాజావలి, షేక్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, ఇతర నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శివపార్వతుల కళ్యాణం



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతుల కళ్యాణ కార్యక్రమాన్ని కడుకమనీయంగా అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో కళ్యాణ కార్యక్రమాన్ని కడుకమనీయంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కళ్యాణ విశిష్టతను భక్తులకు విశదీకరించారు. ఈ సందర్భంగా కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా అమెరికాలో నివాసం ఉంటున్న బుద్ధి బీమేశ్వరరావు, సుధా దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కృష్ణప్రసాద్; రుత్వికులు సుబ్బయ్య స్వామి, మురళి స్వామి, శ్రీనివాసులు స్వామి, నాగరాజు స్వామి, భక్తులు ఉన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌కి వన్నెతెచ్చిన సుగుణమ్మ



**సంగం జూన్ 30 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామ పంచాయితీ నందు బందిళ్ళ చిన్న సుగుణమ్మ అంగన్‌వాడీ టీచర్ యొక్క వాలింటరీ రిటైర్‌మెంట్ ను వెంగారెడ్డిపాళెం మాజీ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆద్వర్యంలో నిర్వ హించారు. ఈకార్యక్రమం నందు సుగుణమ్మ అంగన్‌వాడీ సెంటర్‌కు చేసిన సేవలను గురించి మరియు వారు అందుకున్న అవార్డుల గురించి కొనియాడారు. వెంగారెడ్డిపాళెం గ్రామం నందు ఉన్న అంగన్‌వాడీ కి మంచి పేరు తెచ్చారని తెలిపారు. అనంతరం సుగుణమ్మ కి శాలువాలతో సత్కరించి బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రోజా రమణి, సహోధ్యాపకులు ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి ఉదయ్ ,సచివాలయ సిబ్బంది ఆదిశేషయ్య, స్వరూప, సుజాత, జాబీనా,వాణి మెడికల్ సిబ్బంది, రాజమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మీ,మీనాక్షి,అనిత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గురుకులాలకు స్మార్ట్ ఫోన్ సదుపాయం

**కోట,జూన్ 30 ప్రభాతవార్త :** వసతి గృహాల్లో విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు ఫోన్లను అందుబాటులోకి తీసుకోరానుంది. ఇప్పటి వరకు పిల్లల యోగ క్షేమాలు తెలుసుకునే అవకాశం లేక తల్లిదండ్రులు వ్యవయప్రయాసలకోర్చి వసతి గృహాలకు వచ్చేవారు. ఇప్పుడు ఆయాతన తప్పనుంది.బీఆర్ అంబేద్కర్ గురుకులంలో స్మార్ట్ కారులు వచ్చినట్లు తెలిసింది.విద్యార్థి కుటుంబసభ్యులు సంబంధించిన ఐదు ఫోన్ నంబర్లను స్మార్ట్ ఫోన్లలో ఫీడ్ చేస్తారు. ఆనంబర్లకు మాత్రమే సంబంధిత విద్యార్థి ఫోన్ చేసే వీలుంటుంది.




## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సర్వం సిద్ధం

### - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**చిల్లకూరు, జూన్ 30, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం, పొన్నపరవారిపాలెం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంజరిగిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి గూడూరు నియోజకవర్గం, పొన్న పరివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా రానున్న సందర్భంగా, మంగళవారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యేపాశం సునీల్‌కుమార్, జేసిమొగిలి వెంకటేశ్వర్లుతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తి చేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతన పరిశ్రమలు రానున్నాయని తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల వారిని ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే అవకాశం ఉందని సుమారు 5000 నుంచి 7000 దాకా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి ఫర్నిచర్, కృష్ణపట్నం పోర్టు సిటీ తదితరాలపై ముఖ్యమంత్రి రివ్యూ చేయనున్నారని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నివేదికలు గౌరవ ముఖ్యమంత్రికి సమర్పించనున్నామని ఆయన తెలిపారు. భారీ బందోబస్తు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి సంఘటనలో జరగకుండా నేందుకు 570 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అందరూ సమన్వయంతో పనిచేసి ముఖమంత పర్యటనను విజయవంతం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఏఎస్‌పి సౌమ్య, గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, ఆత్మకూరు ఆర్డీవో పావని, మెప్మా పిడీ, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు వంశీకృష్ణ, కేశవర్ధన్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయండి

### - ఇస్కాన్ ప్రచార కేంద్రం నిర్వహకుడు డాక్టర్ సుఖదేవ్



**గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త** నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో జూలై 18వ తేదీన గూడూరు పట్టణంలో 12వ జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రచార కేంద్రం నిర్వాహకుడు డాక్టర్ సుఖదేవ్ తెలిపారు. మంగళవారం గూడూరు పట్టణం సొసైటీ ప్రాంతంలో ఉన్న గూడూరు ఇస్కాన్ ప్రచార కేంద్రం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పూరీలో జగన్నాథ రథయాత్ర నిర్వహించే కార్యక్రమానికి అనుగుణంగా గూడూరు పట్టణంలో గత పదకొండు సంవత్సరాల నుండి జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూలై 12 వ తేదీన గూడూరు పట్టణంలో జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ రథయాత్ర నారాయణమ్మ గుడి దగ్గర ప్రారంభమై ఐ.సి.ఎస్ రోడ్డు, కుమ్మర వీధి, రాజా వీధి, జడ్పీ హైస్కూల్ రోడ్డు, బనికి సాహెపేట మీదుగా సుందరమహల్ రోడ్డు, టవర్ క్లాక్ మీదుగా డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకుంటుందన్నారు. రథ యాత్రకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్థానిక భక్తులు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ పి.ఎం రావు దంపతులు, మయూరి శ్యామ్ యాదవ్, రాజశేఖర్, బాలబద్ర గోపాల్, రాజా, సురేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం బారాషహీద్ దర్గా

### - మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

### - భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, సర్వమత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరు రొట్టెల పండుగ

### - బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి ఆనం



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త - వైద్యం** ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం నెల్లూరులోని చారిత్రాత్మక బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థ నల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బారాష హీదులను దర్శించుకుని దేశ ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంరామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే మత సామ రస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని పేర్కొన్నారు. భిన్న మతాలు, భిన్న సంప్రదాయాలు, భిన్న సంస్కృతులు కలిగిన ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని పరస్పర గౌరవం, సోదరభావాన్ని చాటుకునే అపూర్వ ఆధ్యాత్మిక ఉత్సవం రొట్టెల పండుగ అని అన్నారు. భారతదేశం వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దేశమని, ఆ గొప్ప సంస్కృతికి ప్రతిబింబమే నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ అని మంత్రి పేర్కొన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు తదితర అన్ని మతాలకు చెందిన భక్తులు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒకే చోట చేరి రొట్టెలను మార్చుకోవడం భారతీయ సం స్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం కేవ లం ఆధ్యాత్మిక విశ్వాసానికి మాత్రమే పరిమితం కాకుండా, సర్వమత సౌభ్రాతృత్వానికి, సా మాజిక ఐక్యతకు, మానవ విలువలకు ప్రతీకగా నిలు స్తోందన్నారు. మతం ఏదైనా మను షులం దరూ ఒక్కటేనని, పరస్పర ప్రేమ, గౌరవం, సహజీవనమే భారతీయతకు మూల సూత్రమని ఈ పండుగ ప్రపంచానికి చాటి చెబుతోందని తెలిపారు. ప్రతి ఏటా దర్గాపై ప్రగాఢ విశ్వాసంతో, స్వర్ణాల చెరువులో జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారని చెప్పారు. గతంలో కొన్ని వేలమంది భక్తులతో ప్రారంభమైన ఈ ఉత్సవం నేడు లక్షలాది మంది పాల్గొనే మహోత్సవంగా రూపాంతరం చెందడం ఈ పండుగ విశిష్టతకు నిదర్శనమన్నారు. దివంగత ఆనం వివేకానందరెడ్డి హయాం నుంచే బారా షహీద్ దర్గా అభివృద్ధికి తమ కుటుంబం కృషి చేస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యా లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎన్డీఏ కూటమి నాయకులు, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో రొట్టెల పండుగ మరింత వైభవంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు గుమ్మలదిబ్బ విద్యార్థి



**కోవూరు, జూన్ 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల పదవతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షై నింగ్ స్టార్ అవార్డు పేరిట విజయవాడలోని మంగళ వారం కార్యాలయానికి పిలిపించుకుని వారికి ప్రత్యేక అ వార్డులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీ దుగా అందజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్ అవార్డుకు కోవూరు మం డలం గుమ్మలదిబ్బ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాయి అపర్ణ ఎంపికైంది. ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో 594 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. మంగళ వారం మంగళ గిరిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యాశాఖ మం త్రి నారా లోకేష్ చేతుల మీదుగా సాయి అపర్ణ అవార్డు పొందడం పట్ల పాఠశాల ప్రాధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.







## కన్నుల పండుగగా శ్రీ ఆత్మారామస్వామి వారి రథోత్సవం





**సంగం జూన్ 30 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ సీతాలక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. మొదట పుణ్యాహవచనం, వాస్తుపూజ, రథంహోమం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించి స్వామి వారిని రథాదరుడ్ని చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారి రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతుల్నిచ్చారు. మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వేషదారణలు ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచాయి. ఉభయకర్తలుగా కీర్తిశేషులు పులగం వెంకటశేషారెడ్డి, జ్ఞాపకార్ధం వారి కుమారుడు పులగం మల్లారెడ్డి, కీర్తి శేషులు పులగం దయాకర్‌రెడ్డి జ్ఞాపకార్ధం వారి కుమారుడు పులగం వెంకట్రామిరెడ్డి, సోదరుడు పులగం వెంకట కృష్ణారెడ్డి, మనిమాల మధుసూదన్‌రెడ్డి, కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వ్యవహారించారు. ఆలయ ఇఒ వరప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

### - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూన్ 30, ప్రభాతవార్త-అగ్రికల్చర్** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ఈవీఎం గో డౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్లను రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్‌పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూ డు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబం ధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గోదాములలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సీల్స్, స్ట్రాంగ్ రూమ్ భద్రతతో పాటు గోదాము అంతర్గత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరుపై రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె విజయ్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, పి కోటేశ్వర్ రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.